AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatodaynews.com

సాగు నీరంటే అంత చులకనా..?



2



2

తిట్టాడని హత్య.. జీవిత ఖైదు విధించిన కోర్టు

మాల కులసంఘ భవన నిర్మాణానికి నిధులివ్వాలి



అక్షరటుడే, ఆర్మూర్: అంకాపూర్‌లో జాతీయ పసుపు బోర్డు ఛైర్మన్ పల్లె గంగారెడ్డిని ఆర్మూర్ ఔటిగల్లి, పోచమ్మ గల్లి అంబేద్కర్ మాల సంఘం అధ్యక్షుడు పులి యుగంధర్ ఆధ్వర్యంలో సంఘం సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. అంబేద్కర్ మాల కుల సంఘం భవన నిర్మాణానికి నిధులు మంజూరుకు సహకరించాలని కోరారు. దానికి ఆయన స్పందిస్తూ.. సహాయ సహకారాలు అందజేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వెన్న రమేష్, పింజ అశోక్, పింజ సుదర్శన్, వెన్న మోహన్, మేకల మురళి, వెన్న సతీష్, నీరడి శ్రవణ్, పికిలిపంటి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

28-10-2026 NIZAMABAD / KAMAREDDY PAGES - 2



ఆర్టీసీ డిపో-1లో అన్‌క్లెయిమ్డ్ పార్సిళ్ల వేలం

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: టీజీఎస్ఆర్టీసీ నిజామాబాద్ 1 డిపో కార్గో, పార్సిల్ విభాగానికి చెందిన అన్‌క్లెయిమ్డ్ పార్సిళ్ల నుఈనెల 30న వేలం వేయనునట్లు డిపో మేనేజర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ వేలం పాటను నిజామాబాద్ 1 డిపో ఆవరణలోని కార్గో కార్యాలయం వద్ద మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రయాణికులు, వినియోగదారులు, సాధారణ ప్రజల సౌకర్యార్థం ఈ వేలంలో పాల్గొనే వారికి 50శాతం రాయితీ కల్పిస్తున్నట్లు డిపో మేనేజర్ పేర్కొన్నారు. ఆసక్తి గల వినియోగదారులు, ప్రయాణికులు నిర్ణీత సమయానికి వేలం ప్రాంగణానికి చేరుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



పటాకుల దుకాణాల నిర్వాహకులు అనుమతి తీసుకోవాలి : సీపీ

అక్షరటుడే, నిజామాబాద్ క్రైం: దీపావళి సందర్భంగా నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో తాత్కాలిక పటాకుల దుకాణాలు నెలకొల్పేవారు అనుమతులు తీసుకోవాలని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. పటాకుల దుకాణాలు నిర్వహించాలనుకునే వారు డివిజినల్ పోలీస్ అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకొని అనుమతి పొందాలని సీపీ తెలిపారు. దీనికి సంబంధించిన ఇతర సమాచారం కోసం సంబంధిత డివిజినల్ స్థాయి అధికారిని సంప్రదించాలన్నారు. అనుమతి లేకుండా దుకాణాలు నెలకొల్పితే వారిపై ఎక్స్‌ప్లోజివ్ యాక్ట్ 1884, రూల్స్ 1933 సవరణ 2008 ప్రకారంగా కఠినచర్యలు తీసుకుంటామన్నారు. పటాకుల దుకాణాలను ఖాళీ ప్రదేశాల్లోనే నెలకొల్పాలని సీపీ సూచించారు. ఒక క్లస్టర్లో 50 షాపులకు మించరాదని.. అలాగే రద్దీగల ప్రదేశాలలో ఎలాంటి పటాకుల షాపులు ఏర్పాటు చేయరాదన్నారు. ఫైర్ సేఫ్టీకి సంబంధించిన జాగ్రత్తలు పాటించాలన్నారు.

ఎల్‌నినో ప్రభావం అన్నదాతలపై పడింది. ఇప్పటికే పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంటలు చేతికి వస్తాయన్న గ్యారెంటీ లేకపోవడంతో ఆగం అవుతున్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 22 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించడంతో ఇటు అన్నదాతలు, అటు సామాన్య ప్రజల్లో ఆందోళన నెలకొంది. - అక్షరటుడే, కామారెడ్డి



కోరలు చాస్తున్న కరువు..

- ఉమ్మడి జిల్లాలో 22 కరువు మండలాలు
- వరి సాగు వద్దంటున్న అధికారుల
- ఆరుతడి పంటలు వేయాలని సూచన
- ఇప్పటికే ఎండుతున్న పంటలు
- ఆందోళన చెందుతున్న రైతులు

ఉమ్మడి జిల్లాలో కరువు కోరలు చాస్తోంది. వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. వర్షాల పరిస్థితిని అంచనా వేసి ఉమ్మడి జిల్లాలోని 22 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించింది. ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో వర్షాభావ పరిస్థితి మరింత పెరిగే అవకాశం ఉండటంతో రైతులు, సామాన్య ప్రజలకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వం విడుదల చేసిన జాబితా ప్రకారం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా లో 22 మండలాలు మోస్తరు కరువు జాబితాలో ఉన్నాయి. కామారెడ్డి జిల్లాలో జుక్కల్, పెద్ద కొడప్‌గల్, సదాశివనగర్, మహమ్మద్ నగర్ మండలాలను , నిజామాబాద్ జిల్లాలో నవీపేట్, నందిపేట్, ఆర్మూర్, ముప్కాల్, మెండోరా, ఎర్గట్ల, వేల్పూర్, మాక్లూర్, నిజామాబాద్ నార్త్, నిజామాబాద్ రూరల్, నిజామాబాద్ సౌత్, మోపాల్, ఇందల్వాయి, మోస్రా, చందూర్, ఆలూర్, వర్ని, పోతంగల్ మండలాలు కరువు జాబితాలో చేరాయి.

ఆరుతడి పంటలపై అవగాహన


రాష్ట్రవ్యాప్తంగా ఎల్‌నినో కారణంగా రుతుపవనాలు బలహీనపడి వర్షాలు తగ్గిపోయాయి. దీంతో భూగర్భ జలాలు పాతాళానికి పడిపోయాయి, చెరువులు, కుంటలు ఎండిపోయాయి. ఈ నేపథ్యంలో రైతులు నష్టపోకుండా ఉండేందుకు వ్యవసాయ శాఖ అధికారులు ఆరుతడి పంటల వైపు మళ్లాలని సూచిస్తున్నారు. తక్కువ నీటితో, తక్కువ పెట్టుబడితో పండే జొన్న, సజ్జ, మినుము, పెసర, శనగ, పొద్దుతిరుగుడు, ఆముదం వంటి పంటలు వేస్తే కరువు పరిస్థితుల్లో కూడా కొంత దిగుబడి వచ్చే అవకాశం ఉందని అవగాహన కల్పిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో రైతులందరూ వరి పంట మీదనే ఆధారపడ్డారు. కానీ వరి సాగుకు ఎకరాకు వేల లీటర్ల నీరు అవసరం. ప్రస్తుతం నీటి లభ్యత లేని పరిస్థితుల్లో వరి వేస్తే పంట ఎండిపోయి పెట్టుబడి కూడా చేతికి వచ్చే పరిస్థితి లేదు. దాంతో ఈ యాసంగిలో వరి సాగును వీలైనంత తగ్గించుకోవాలని, తప్పని పరిస్థితుల్లో అయితే తక్కువ కాలంలో పండే వరి రకాలను ఎంచుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి

కరువు మండలాల్లో ప్రతి నీటిచుక్క బంగారంతో సమానం. అందుబాటులో ఉన్న నీటిని బిందు సేద్యం, తుంపర సేద్యం ద్వారా పొదుపుగా వాడుకోవాలని అధికారులు చెబుతున్నారు. ఇష్టానుసారంగా బోర్లు వేయడం, నీటిని వృథా చేయడం చేయవద్దని హెచ్చరిస్తున్నారు. కరువు మండలాలకు ప్రభుత్వం కల్పించే ప్రత్యేక సౌకర్యాలైన పంట రుణాల వసూలు వాయిదా, ఉపాధి హామీ పని దినాల పెంపు, తాగునీటి ట్యాంకర్ల సరఫరా, పశుగ్రాసం కేంద్రాల ఏర్పాటు వంటి వాటిని రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రైతులు వింటారా..

ఉమ్మడి జిల్లాలో రైతులు ఎక్కువ శాతం వరి సాగు చేస్తారు. గత సీజన్ పూర్తికాక ముందునుంచే ఆరుతడి పంటలే వేయాలని అధికారులు సూచించినా రైతులు లక్షల ఎకరాల్లో వరిపంట వేశారు. అయితే ప్రస్తుతం ఉన్న వర్షాభావ పరిస్థితుల్లో రైతులు వరిసాగు వద్దంటే వినే పరిస్థితి ఉందా అని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. క్షేత్రస్థాయిలో రైతుల వద్దకు నేరుగా అధికారులు వెళ్లి అవగాహన కల్పించలేదన్న టాక్ వినిపిస్తోంది.



బియ్యం కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు: కలెక్టర్ ఇలా త్రిపాఠి

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ : బియ్యం కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. కలెక్టరేట్‌లో బుధవారం రైస్ మిల్లర్లు, ట్రేడర్లతో సమావేశం నిర్వహించారు. బియ్యం ధరలను నియంత్రణలో ఉంచేందుకు రైస్ మిల్లర్లు, బియ్యం వ్యాపారులు, ట్రేడర్లు జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కలెక్టర్ సూచించారు. బియ్యం నిల్వలు, సరఫరా, విక్రయాల విషయంలో పూర్తి పారదర్శకంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. కృత్రిమ కొరత సృష్టించి బియ్యం ధరలను పెంచేందుకు ప్రయత్నించినా, అక్రమ నిల్వలకు పాల్పడినా సంబంధిత వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనల అతిక్రమణకు పాల్పడే ట్రేడర్ల లైసెన్సులు రద్దు చేసేందుకు వెనుకాడబోమని స్పష్టం చేశారు. ప్రజలకు నిత్యావసరమైన బియ్యం సరసమైన ధరలకు అందుబాటులో ఉండేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. మార్కెట్‌లో బియ్యం లభ్యత, ధరల పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ బియ్యం క్రయ విక్రయాలలో ఎలాంటి అంతరాయాలు ఏర్పడకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. బియ్యం ధరలు, నిల్వలు, సరఫరాకు సంబంధించి ప్రజల్లో అనవసర ఆందోళన కలిగించే రీతిలో అపోహలు, వదంతులను వ్యాప్తి చేయవద్దని కలెక్టర్ కోరారు. వాస్తవ పరిస్థితులను నిర్ధారించుకోకుండా తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేయడం వల్ల ప్రజల్లో గందరగోళం ఏర్పడటంతో పాటు మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. ప్రజలకు వాస్తవ సమాచారాన్ని అందించేందుకు వ్యాపారులు సహకరించాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రాజాగౌడ్, సంబంధిత శాఖల అధికారులు, రైస్ మిల్లర్లు, ట్రేడర్లు పాల్గొన్నారు.

ఎంపీ అర్వింద్ ప్రధాని మోదీ ఇంటి ముందు భిక్షాటన చేస్తే బాగుండేది : భూపతిరెడ్డి

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: ఎంపీ అర్వింద్ మోదీ ఇంటి భిక్షాటన ముందు చేస్తే బాగుండేదని ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. నగరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎంపీ అర్వింద్ భిక్షాటన చేయాలంటే మోడీ ఇంటి ముందు, పార్లమెంట్ ముందు చేయాల్సిందని ఎమ్మెల్యే భూపతిరెడ్డి సలహా ఇచ్చారు. రాష్ట్రానికి రావాల్సిన నిధుల కోసం ఆయన భిక్షాటన చేస్తే బాగుండేదన్నారు. నిజామాబాద్ మాధవనగర్ ఆర్వోబీ కోసం సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని.. ఇది తెలిసి ఎక్కడ క్రెడిట్ కాంగ్రెస్ వాళ్లకు వెళ్తుందేమోనని ఆగమేఘాల మీద నిరసన దీక్ష చేయడాన్ని ప్రజలు చూశారన్నారు. పసుపు బోర్డుపై ఓపెన్ డిబేట్‌కు తాను సిద్ధమని ఎంపీ అర్వింద్‌కు భూపతిరెడ్డి సవాల్ విసిరారు. అన్ని ఆధారాలతో పసుపు బోర్డు కార్యాలయానికి తాను వస్తానన్నారు. పసుపు బోర్డు తేవడం అనేది బోర్డు తగిలించడం కాదని.. బోర్డుతో రైతులకు కలిగిన ఉపయోగాన్ని తెలపాలన్నారు. ఆ పసుపు బోర్డు ఆఫీస్‌ను మేమే అద్దెకిచ్చామన్నారు. దమ్ముంటే 8 మంది ఎంపీలు కేంద్రానికి రావాల్సిన నిధుల కోసం కొట్లాడాలని



సూచించారు. అంతేకానీ రోడ్లపై భిక్షాటన చేస్తే ఏమస్తుందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో ఉర్దు అకాడమీ ఛైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



ఎస్ఎఫ్ఎస్‌లో 'సురక్షిత బచ్‌పన్ అభియాన్' న్యాయ చైతన్య సదస్సు

అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్: నగరంలోని సుభాష్ నగర్‌లోని ఎస్ఎఫ్ఎస్ హైస్కూల్‌లో 'సురక్షిత బచ్‌పన్ అభియాన్' న్యాయ చైతన్య సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో పొక్సో చట్టం-2012 పై విద్యార్థులకు సదస్సులో అవగాహన కల్పించారు. ఈ సదస్సులో 2వ అదనపు జిల్లా జడ్జి నారాయణ మాట్లాడుతూ.. విద్యార్థులు ఇంట్లోగానీ, సమాజంలోగానీ ఏవైనా సమస్యలు ఎదురైతే ధైర్యంగా పోరాడాలని సూచించారు. భయపడి సమస్యలను దాచుకోకూడదని, తల్లిదండ్రులు లేదా నమ్మకమైన వారికి తెలియజేయాలని తెలిపారు. బాధితుల వివరాలను పూర్తిగా రహస్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి నీలిమ మాట్లాడుతూ.. పొక్సో చట్టంపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. ఆపదలో ఉన్న వారికి జిల్లాకోర్టు ఆవరణలోని న్యాయ సేవా అధికార సంస్థ ఎల్లప్పుడూ తోడుగా ఉంటుందని చెప్పారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ గేమ్స్, సోషల్ మీడియా ప్రభావంతో పిల్లలు దారితప్పకుండా ఉపాధ్యాయులు కంట కనిపెడుతూ ఉండాలన్నారు. కార్యక్రమంలో చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ సాదులాలా, ప్యానల్ అడ్వకేట్ శ్రీకాంత్, అసిస్టెంట్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు రాజశ్రీ, ప్రతిభ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10 వేల హామీ అమలు చేయాలి

అక్షరటుడే, బాన్సువాడ : మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన రూ.10 వేల వేతన హామీని వెంటనే అమలు చేయాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా బుధవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ నాయకులు, కార్మికులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు దుబాస్ రాములు మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన పెండింగ్ వంట బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన పథకంలో సెంట్రలైజ్డ్ కిచెన్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మధ్యాహ్న భోజన కార్మికులకు నెలకు రూ.10 వేల వేతనం ఇస్తామని ఇచ్చిన ఎన్నికల హామీని తక్షణమే అమలు చేయాలని పేర్కొన్నారు.



కోడిగుడ్లు, గ్యాస్‌తో పాటు వంటకు అవసరమైన నిత్యావసర వస్తువులను ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు శంకర్, సురేష్, కమ్మరి రాములు, కూసుకుంట్ల సాయిలు, బాల్ రాజ్, స్వరూప, కృష్ణవేణి, సావిత్రి, నాగ గౌడ్, కిషన్, ఎండీ హుస్సేన్ బీ, సువర్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతికి అడ్డాగా కామారెడ్డి బల్దియా

అక్షరటుడే, కామారెడ్డి : కామారెడ్డి మున్సిపాలిటీలో అవినీతికి అంతు లేకుండా పోతోందని బీజేపీ కౌన్సిలర్లు ఆరోపించారు. మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతిని నిర్మూలించాలని, పట్టణంలో సమస్యలను పరిష్కరించాలని బల్దియా ఎదుట బీజేపీ కౌన్సిలర్లు, నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ కౌన్సిలర్లు మాట్లాడుతూ ప్రతి శాఖలో అవినీతి రాజ్యమేలుతోందని ఆరోపించారు. పట్టణంలోని వివిధ వార్డుల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించడం లేదని, నీటి సరఫరా కుంటుపడిందన్నారు. బతుకమ్మ పండుగ సందర్భంగా కామారెడ్డి పెద్ద చెరువు వద్ద వీధి దీపాలు ఏర్పాటు చేయకపోవడం మున్సిపల్ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. మున్సిపాలిటీలో డబ్బులు ఇస్తే తప్ప పనులు జరగడం లేదని విమర్శించారు. పట్టణ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, జిల్లా కలెక్టర్ చొరవ తీసుకుని మున్సిపల్ కమిషనర్ ను, అవినీతి అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు వచ్చి సమాధానం చెప్పే వరకు ధర్నా విరమించేది లేదని భీష్మించారు.



కామారెడ్డి తహశీల్దార్ హిమబిందు ధర్నా వద్దకు చేరుకుని సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. ఈ కార్యక్రమంలో పట్టణ బీజేపీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

2న 'చలో సబ్ కలెక్టర్' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి



అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: పేద ప్రజల భూములను 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించాలని అఖిలభారత ఐక్య రైతు సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వి. ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు 2న 'చలో సబ్ కలెక్టర్' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సూచించారు. అదేవిధంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులైన పేదలందరికీ ఎలాంటి జాప్యం లేకుండా ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. భీమ్‌గల్ మండలంలోని తాళ్లపల్లి చౌరస్తాలో బుధవారం ఏఐయూకేఎస్ ఆధ్వర్యంలో జరిగిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదలు సాగు చేసుకుంటున్న, నివాసం ఉంటున్న భూములను 22 ఏ నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల వారు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కె రాజేశ్వర్, రిక్క దామోదర్, నడ్పినర్సయ్య, ఎం శ్రావణ్, బి మోహన్ తదితరులున్నారు.

అండర్19 క్రికెట్‌కు ఇద్దరు క్రీడాకారుల ఎంపిక



అక్షరటుడే, ఆర్మూర్ : ఆర్మూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలుర) విద్యార్థులు క్రీడల్లో సత్తా చాటారు. ఎస్‌జీఎఫ్ అండర్-19 బాలుర క్రికెట్ ఎంపికల్లో ఇద్దరు విద్యార్థులు ఎంపికై కళాశాల ఖ్యాతిని పెంచారు. ఉమ్మడి నిజామాబాద్ స్థాయిలో ఈనెల 27న నిర్వహించిన సెలక్షన్స్‌లో ఆర్మూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఎండీ సఫీ (ఎంపీసీ ప్రథమ సంవత్సరం), ఎండీ సాహిల్ (ఎంపీసీ ద్వితీయ సంవత్సరం) ఎంపికయ్యారు. విద్యార్థులు ఎంపిక కావడంపై కళాశాల ప్రిన్సిపాల్ కె.సుభాష్ హర్షం వ్యక్తంచేశారు. జిల్లాస్థాయి నుంచి రాష్ట్ర స్థాయిలో రాణించాలని, మరింత కష్టపడి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో రంజీట్రోఫీ, ఐపీఎల్ హైదరాబాద్ జట్టుకు ఎంపిక కావాలని సూచించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు రవి, చంద్రశేఖర్, నరేష్, లక్ష్మణ్, రామకృష్ణ, గంగాధర్, రహమాన్, రాజయ్య తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఉజ్వల పాఠశాల విద్యార్థులు



అక్షరటుడే,నందిపేట్ : మండల కేంద్రంలో ఇటీవల ఉజ్వల హైస్కూల్‌కు చెందిన సుంకరి సుధాంశ్ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. తాజాగా మరో ఇద్దరు విద్యార్థినిలు కుస్తాపురం హర్షిని, కదం దీపిక సైతం ఫుట్‌బాల్ టోర్నీకి ఎంపికై సత్తా చాటారు. మంగళవారం జరిగిన అండర్ 14 ఎస్‌జీఎఫ్ జిల్లా ఫుట్‌బాల్ టోర్నీలో ప్రతిభ కనబర్చిన హర్షిని, దీపిక ఈనెల 29 నుంచి హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నీలో పాల్గొనే జిల్లాజట్టులో స్థానం సంపాదించారు. పాఠశాల కరెస్పాండెంట్ గోజూరి అరుణ్, వ్యాయామ ఉపాధ్యాయులు కెన్నెడీ, ఉపాధ్యాయ బృందం కలిసి విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఫుట్‌బాల్‌లో రాష్ట్రస్థాయికి ప్రాతినిధ్యం వహించడం ఎంతో ఆనందంగా గర్వంగా ఉందన్నారు.

పోతంగల్ మండలం హెగ్డేలి గ్రామానికి ఆనుకొని ఉన్న చెరువు (కుంట) తూము నుంచి ఐదేళ్లుగా సాగునీరు లీకవుతోంది. ఈ చెరువు కింద పలువురు రైతులు పంటలు చేస్తారు. అయితే లీకేజీలు జరుగున్నప్పటికీ స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించుకోవట్లేదని గ్రామ రైతులు ఆరోపిస్తున్నారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో సాగుకు నీరిచ్చేది లేదని సీఎం రేవంత్‌రెడ్డి తెగేసి చెప్పిన నేపథ్యంలో ఇలా విలువైన సాగునీరును వృథా చేయడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. ఏళ్లుగా ఇలా తూము నుంచి విలువైన నీరు వృథాగా పోతున్నా పట్టించుకోకపోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- అక్షరటుడే, కోటగిరి



సాగు నీరంటే అంత చులకనా..?

■ హెగ్డేలి చెరువులో తూముపై నిర్లక్ష్యం ■ రైతుల్లో ఆందోళన ■ అధికారులు స్పందించాలని వేడుకోలు

ఐదేళ్లుగా ఇదే తంతు



ఐదేళ్లుగా తూము నుంచి నీళ్లు వృథాగా పోతున్నాయి. కానీ అధికారులు పట్టించుకోవట్లేదు. తూము నుంచి నీళ్లు వృథాగా పోతుండడంతో తూము సైతం శిథిలావస్థకు చేరింది. నీళ్లు లీక్ కాకుండా చాలాసార్లు రైతులందరూ కలిసి సంచులలో మట్టి నింపి నీళ్లు వెళ్లకుండా అడ్డం పెట్టినం. అయినా నీళ్లు పోతున్నాయి. అధికారులు స్పందించాలి..

– పుప్పాల శ్రావణ్, రైతు

లీకేజీ కాకుండా చూస్తాం



తూము నుంచి లీకేజీ అవుతున్నమాట వాస్తవమే. విలువైన సాగునీరు వృథా కాకుండా చర్యలు తీసుకుంటాము. సంబంధిత అధికారులకు సమాచారం అందించి త్వరలోనే తూము లీకేజీని అరికడతాం.

– నాగరాజు, సర్పంచ్

లీకేజీలను అరికట్టాలి



ఎల్‌నినో ప్రభావం ఎక్కువగా ఉంది. వర్షాలు కూడా లేవు. తూము లీకేజీలు అరికట్టకపోతే సాగునీరు వృథా అయ్యే అవకాశం ఉంది. అధికారులు పట్టించుకోవాలి.. త్వరగా తూము బాగు చేయాలి. లేకపోతే భవిష్యత్తులో రైతులకు సమస్యలు వచ్చే అవకాశం ఉంది.

– రుక్మయ్య, రైతు

పెళ్లి పేరుతో మైనర్‌ను మోసం చేసిన వ్యక్తి అరెస్ట్



అక్షరటుడే, నిజామాబాద్ క్రైం: పెళ్లి చేసుకుంటానని నమ్మించి మైనర్‌ను తీసుకెళ్లిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు 5వ టౌన్ పోలీసులు వివరాలు వెల్లడించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నగరంలోని సీతారాంనగర్ చెందిన రవిని పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్సై సునీల్ మాట్లాడుతూ.. మైనర్లపై ఎలాంటి అఘాయిత్యాలకు పాల్పడినా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ముగిసిన సీనియర్ మహిళల కబడ్డీ శిక్షణ శిబిరం

అక్షరటుడే, ముప్కాల్: జిల్లాలోని ముప్కాల్ మండల కేంద్రంలోని భూదేవ్ ఇండోర్ స్టేడియంలో ఈనెల 25 నుంచి 27 వరకు నిర్వహించిన సీనియర్ మహిళల కబడ్డీ శిక్షణ శిబిరం బుధవారం ముగిసింది. శిబిరంలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారిణులతో జిల్లా మహిళల కబడ్డీ జట్టును ఖరారు చేసినట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె. గంగాధర్ రెడ్డి తెలిపారు. జట్టు సభ్యులుగా అఖిలాండేశ్వరి (కెప్టెన్), గౌతమి, శిరీష, మధుప్రియ, దివ్యరాణి, జె. శిరీష, స్నేహిత, సమత, చరణ్య, సంజన స్నేహిత, కావేరి, నికిత, భార్గవి ఎంపికయ్యారు. జట్టుకు కోచ్‌గా బి. సాయిలు వ్యవహరించనున్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు జైడి రాజకుమార్, అనురాధ, కవిత, పడకల్ అశోక్ పర్యవేక్షణలో జట్టు ఎంపిక జరిగింది. ఈనెల 28 నుంచి 30 వరకు ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో జరిగే 73వ అంతర్‌జిల్లాల



సీనియర్ మహిళల రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో జిల్లాజట్టు పాల్గొననుంది. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఉమామహేశ్వర్ రెడ్డి, సోమేశ్, జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ అధికారి మల్లికార్జున్ యాదవ్, జాతీయ కబడ్డీ క్రీడాకారులు పడకల్ అశోక్, సంజీవ్, గద్దల గంగారాం తదితరులు పాల్గొన్నారు.

బాలసదనం చిన్నారి దత్తత

అక్షరటుడే, కామారెడ్డి : కామారెడ్డి బాలసదనంలోని ఓ చిన్నారికి కొత్త జీవితం లభించింది. కలెక్టర్ ఆధ్వర్యంలో బాలసదనంలో ఉన్న చిన్నారిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్నమయ్య జిల్లా మదనపల్లెకు చెందిన దంపతులకు బుధవారం నిబంధనల ప్రకారం దత్తతగా అందజేశారు. చిన్నారులకు కుటుంబ ప్రేమ, సంరక్షణ, భద్రత కల్పించడమే దత్తత లక్ష్యమని అధికారులు తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు, చట్టాలకు అనుగుణంగా దత్తత ప్రక్రియను పూర్తి చేసి చిన్నారిని దంపతులకు అప్పగించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులు మాట్లాడుతూ దత్తత తీసుకున్న చిన్నారికి ప్రేమ, ఆప్యాయత, మెరుగైన విద్య, ఆరోగ్య సంరక్షణ అందించి



ఉజ్వల భవిష్యత్తు అందించాలని దత్తత తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి వెంకటేష్, సూపరింటెండెంట్ అరుణ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



మాదక ద్రవ్య రహిత భారతదేశాన్ని తయారు చేద్దాం

అక్షరటుడే, కామారెడ్డి : నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కామారెడ్డిలో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ర్యాలీ, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. నిజాంసాగర్ చౌరస్తా నుండి ర్యాలీ నిర్వహించి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కర్షక్ బీఎడ్ కళాశాలలో మాదక ద్రవ్య రహిత భారతదేశం అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ ఎం.సంజీవరెడ్డి, స్టేట్ ఎంసీ మెంబర్ డా.ఎం. జైపాల్ రెడ్డి, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ముకుందరెడ్డి, సీఐ నరహరి మాట్లాడుతూ విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, ఎక్కడైనా మాదక ద్రవ్యాలకు సంబంధించిన సమాచారం ఉంటే పోలీస్ శాఖకు, ఎక్సైజ్ శాఖకు 1908 టోల్ ఫ్రీ నంబర్ కు తెలియజేయాలని సూచించారు. . అనంతరం గవర్నర్ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.

తిట్టాడని హత్య.. జీవిత ఖైదు విధించిన కోర్టు

అక్షరటుడే, నిజామాబాద్ క్రైం : దుర్భాషలాడాడని హత్య చేసిన వ్యక్తికి న్యాయస్థానం జీవితఖైదు విధించింది. ఈ మేరకు సీపీ సాయిచైతన్య వివరాలు వెల్లడించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ధర్పల్లి రాజేశ్వర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ రూరల్ మండలం కొత్తపేట మల్కాపూర్ గ్రామానికి చెందిన తాటిపాముల శివప్రసాద్ గౌడ్‌ను బైరి నర్సాగౌడ్ హత్య చేశాడు. 2024 జూన్ 6న శివప్రసాద్ ఆలయానికి వెళ్తుండా.. నర్సాగౌడ్ ఎదురు పడ్డాడు. ఈ క్రమంలో తనను తనను ఉద్దేశించి శివప్రసాద్ బూతులు తిట్టాడనే కోపంతో కర్రతో కొట్టి గాయపర్చాడు. మళ్లీ మధ్యాహ్నం నర్సాగౌడ్ శివప్రసాద్ ఇంటికి వెళ్లి వెంటతెచ్చుకున్న కర్రతో మరోసారి దాడి చేశాడు. ఈ దాడిలో శివప్రసాద్ కోమాలోకి వెళ్లి మృతి చెందాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు 21మంది సాక్షుల వాంగ్మూలాలు సేకరించి కోర్టుకు సమర్పించారు. నర్సాగౌడ్‌పై నేరం రుజువుకావడంతో కోర్టు ఆయనకు జీవిత ఖైదు విధించింది. ఈ కేసులో ముద్దాయికి శిక్ష పడడంలో కృషి చేసిన ఇన్వెస్టిగేషన్ ఎస్సైలు రామారావు, మహేష్, సీఐలు సతీష్, సురేష్‌కుమార్‌లను సీపీ సాయి చైతన్య అభినందించారు.



యశోద హాస్పిటల్స్‌లో అధునాతన యూరాలజీ, కిడ్నీ మార్పిడి సేవలు

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ : యశోద హాస్పిటల్స్‌లో అధునాతన యూరాలజీ, కిడ్నీ మార్పిడి సేవలు అందిస్తున్నామని సోమాజిగూడ యశోద హాస్పిటల్స్ సీనియర్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి అన్నారు. నగరంలోని నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కిడ్నీ రాళ్లు, ప్రోస్టేట్ సమస్యలు, మూత్ర సంబంధిత రుగ్మతలు, క్యాన్సర్లకు సకాలంలో ముందస్తు రోగ నిర్ధారణ ఎంతో కీలకమని ఆయన స్పష్టం చేశారు. లాపరోస్కోపిక్, రోబోటిక్, లేజర్ వంటి ఆధునిక చికిత్సల ద్వారా చిన్న కోతలతో సమర్థవంతమైన పరిష్కారాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తీవ్రమైన నొప్పి, మూత్రంలో రక్తం లేదా మూత్ర విసర్జనలో ఇబ్బంది వంటి లక్షణాలు ఉంటే వెంటనే నిపుణులను సంప్రదించాలని కోరారు. చివరి దశ కిడ్నీ వ్యాధి ఉన్నవారికి అవసరమైన వైద్య పరీక్షలు, చట్టపరమైన అనుమతుల ప్రక్రియ పూర్తి చేసి కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స అందిస్తున్నామని తెలిపారు. యశోద గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ హైదరాబాద్‌లోని నాలుగు ప్రధాన కేంద్రాల ద్వారా ప్రపంచ స్థాయి వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు.

గేదె విషయంలో గొడవ.. ఆపేందుకు వెళ్లిన మహిళ మృతి



అక్షరటుడే, గాంధారి: ఇంటి పక్కన రెండు కుటుంబాలు గొడవ పడుతుంటే ఆపేందుకు వెళ్లిన ఓ వృద్ధురాలు అనుకోని స్థితిలో ప్రాణాలు కోల్పోయింది. ఈ ఘటన గాంధారి మండలం లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే గాంధారి మండలంలోని నేరల్‌తండా గ్రామానికి చెందిన మధురా భాయ్ ఇంటి పక్కన వరుసకు కోడళ్లయిన ఇద్దరు మహిళలు గొడవ పడుతున్నారు. గేదెను తమ స్థలంలో కట్టేసిందనే విషయంలో ఇరువురు మహిళలు కొట్లాడుతుండగా.. మధ్యలో మధురా బాయి వెళ్లి సముదాయించే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో వారు కర్రతో ఆమె తలపై దాడిచేసినట్లుగా సమాచారం. దీంతో గాయపడ్డ మధురబాయి (60)ను తండావాసులు వెంటనే గాంధారి ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లుగా వైద్యులు పేర్కొన్నారు. దీంతో తండావాసులు గాంధారి మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై ధర్నా చేశారు. మధురబాయి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అక్కడికి చేరుకున్న సీఐ చౌదరి, ఎస్సై మహేందర్ బాధిత కుటుంబాలకు నచ్చజెప్పినప్పటికి వారు వినిపించుకోలేదు.

ముదిరాజ్‌లను బీసీ'ఏ'లో చేర్చవద్దు

అక్షరటుడే, కోటగిరి : ముదిరాజ్‌లను బీసీ'ఏ'లో చేర్చవద్దని పోతంగల్ మండల గంగపుత్ర, మత్స్య కార్మిక సహకార సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పోతంగల్ మండల కేంద్రంలోని తహశీల్దార్ సందీప్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గంగపుత్ర సంఘం అధ్యక్షులు శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఇటీవల పండుగ సాయన్న జయంతి కార్యక్రమం సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ముదిరాజుల కులస్తులను బీసీ-ఏలో చేరుస్తామని ప్రకటించారన్నారు. ఈ ప్రతిపాదన వల్ల బీసీ-ఏ జాబితాలో ఉన్న కులాల హక్కులు, విద్య, ఉద్యోగ, అవకాశాలపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో గంగపుత్రం సంఘం సభ్యులు, భూమయ్య, మక్కయ్య, చంద్రబోయి, అబ్బయ్య, శ్రీనివాస్, రాజు, శివయ్య, సాయిలు, కుల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



మహానంది పురస్కారాన్ని అందుకున్న కళాకారుడు బత్తుల హరీష్

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: కళా రంగంలో చేసిన విశేష కృషికి గాను జిల్లాలోని యానంపల్లి గ్రామానికి చెందిన నటుడు, కళాకారుడు బత్తుల హరీష్‌ను 'మహానంది పురస్కారం' వరించింది. విశాఖపట్నం పబ్లిక్ లైబ్రరీలో తెలుగు సాహితీ సంస్కృతి సేవా ట్రస్ట్, ఆంధ్రప్రదేశ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. 'ప్రేమకావ్యం', 'అఘోర' చిత్రాల్లో నటించి మెప్పించిన హరీష్ సాధించిన ఈ ఘనతపై విశ్వ తేజస్ బృందం హర్షం వ్యక్తం చేస్తూ ఆయనను ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా విశ్వ తేజస్ సంస్థ వ్యవస్థాపకులు తిరునగరి శ్రీహరి, మెంటార్లు చింతల గంగాదాస్, వేదాంతం రంగనాథ్, బృందం సభ్యులు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చి సినీ, కళారంగాల్లో గుర్తింపు తెచ్చుకోవడం యానంపల్లి గ్రామానికే కాకుండా నిజామాబాద్ జిల్లా మొత్తానికి గర్వకారణమని కొనియాడారు. హరీష్ కళాతృష్ణ, అంకితభావం అభినందనీయమని, ముమ్ముందు ఆయన మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

